






సత్తుపల్లి: అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, పెనుబల్లి: ఆర్డీవో కార్యాలయంలో.., ఖమ్మం రూరల్‌లో కమిషనర్ శ్రీనివాసరెడ్డి, కూసుమంచి: నేలకొండపల్లిలో ఎస్సై సంతోశ్, మధిర: తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ఎర్రుపాలెంలో..



ఖమ్మం: బీఆర్ఎస్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ఆర్జేసీ కృష్ణ



ఖమ్మం: అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సండ్ర, ఆర్జేసీ కృష్ణ, కొండబాల, బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు

## కేసీఆర్ అవిశ్రాంత పోరాట ఫలమే..

# తెలంగాణ ఆవిర్భావం

- ఉద్యమసారథి పాలనలోనే రాష్ట్రం బంగారుమయం
- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు
- ఖమ్మం తెలంగాణ భవన్‌లో ఘనంగా వేడుకలు

కేసీఆర్ అవిశ్రాంత పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు కేసీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ సారథి పాలనలో తెలంగాణ బంగారుమయమైందని గుర్తు చేశారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే ఇందుకు నిదర్శనాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ సహా వివిధ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. అన్ని కార్యాలయాల్లోనూ జాతీయ పతాకాలను ఎగురవేశారు. అమరువీరుల స్తూపాలకు, తెలంగాణ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఉద్యమంలో అప్పటి ప్రభుత్వాల నిర్బంధాలను, కేసీఆర్ సారథ్యంలో నాడు జరిగిన ఉద్యమ ఘట్టాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఉద్యమసారథి నాయకత్వంలో ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా 14 ఏళ్లు సాగిన పోరాట ఘట్టాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ తదితరులు మాట్లాడారు. తెలంగాణపై సీమాంధ్ర పాలకుల వివక్షను ఎదిరిస్తూ ఉద్యమసారథి సారథ్యంలో సుదీర్ఘకాలం ఉద్యమం సాగిందని, చివరికి కేసీఆర్ దీక్షతో స్వరాష్ట్ర కల సాకారమైందని జ్ఞప్తికి తెచ్చారు. నీళ్లు, నిధులు, నియామకాలను సాధించుకోవడమే కాకుండా రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుకొని దేశానికి ఆదర్శంగా నిలిపే సువర్ణావకాశం కేసీఆర్ ద్వారానే కలిగిందని పేర్కొన్నారు.

- నమస్తే నెట్‌వర్క్, జూన్ 2



మామిళ్లగూడెం: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న జడ్జీ సీతాపో



ఖమ్మం సిటీ: గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో జెండా ఎగురవేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు








ముదిగొండలో తహసీల్దార్, బోనకల్లులో బీఆర్ఎస్ నాయకులు, కారేపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ప్రత్యేకాధికారి, ఖమ్మం: జెండాను ఆవిష్కరిస్తున్న టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు, ఖమ్మం:జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న కొండబాల కోటేశ్వరరావు, ఖమ్మంలోని రవాణా శాఖ కార్యాలయంలో..

## బొగ్గు లోడింగ్ ఇవ్వడం లేదంటూ ఆందోళన

కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ రోడ్డు మార్గానికి లారీలను అడ్డు పెట్టిన యజమానులు

సత్తుపల్లిలో జీఎం కార్యాలయం ప్రారంభించాలని డిమాండ్



బొగ్గు లోడింగ్‌ను అడ్డుకున్న లారీ యజమానులు

సత్తుపల్లిటౌన్ జూన్ 2: బొగ్గును లోడింగ్‌కు ఇవ్వకుండా సింగరేణి అధికారులు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపిస్తూ సత్తుపల్లిలో లారీ యజమానుల సంఘం నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. కిష్టారం ఓసీ నుంచి రుద్రంపూర్ కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ రోడ్డు మార్గానికి అడ్డుగా లారీలను పెట్టి రవాణా వ్యవస్థను అడ్డుకోవడంతో సింగరేణి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ కిరణ్ లారీ యజమానుల సంఘం కార్యాలయానికి వెళ్లి తక్షణమే లారీను తొలగించాలని, లేదంటే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ససేమిరా అన్న లారీ యజమానులు ఆందోళనను యథావిధిగా కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు లారీ యజమానులు విలేకరులతో మాట్లాడుతూ సత్తుపల్లి సింగరేణి బొగ్గు గనులు ప్రారంభించిన నాటి నుంచి మూడేళ్ల క్రితం వరకు రోడ్డు మార్గం ద్వారా బొగ్గును వివిధ ప్రాంతాలకు తరలిస్తూ జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. అయితే ఇటీవల వచ్చిన సింగరేణి అధికారులు రైలు మార్గం ఏర్పడడంతో సత్తుపల్లి కేవీఆర్ ఓసీ-1, 2లతోపాటు కిష్టారం ఓసీ నుంచి వచ్చే నాణ్యమైన బొగ్గును రైల్వే మార్గం, లారీ టిప్పర్ల ద్వారా కొత్తగూడెంలోని రుద్రంపూర్ కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్‌కు తరలిస్తున్నారని, నాణ్యత లేని బొగ్గును స్థానిక లారీ యజమానులకు ఇస్తున్నారని ఆరోపించారు. ఇలా నాణ్యత లేని బొగ్గును సత్తుపల్లి ప్రాంతంలో చూపడం వల్ల బొగ్గు కొనుగోళ్లకు వచ్చే పారిశ్రామికవేత్తలు సత్తుపల్లిలో పర్మిట్లు తీసుకోకుండా కొత్తగూడెం నుంచి పర్మిట్లు తీసుకొని.. సత్తుపల్లి నుంచి తరలించిన బొగ్గును కొత్తగూడెంలో కొనుగోలు చేసి తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సింగరేణిపై ఆధారపడి జీవిస్తున్న తమ లారీలకు లోడింగ్ రావడం లేదని, 700 వరకు ఉన్న లారీలు కిస్తీలు కట్టలేక 450కు చేరాయని, ఇదే పరిస్థితి కొనసాగితే రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. కొత్తగూడెంకు చెందిన కోల్ క్వాలిటీ కంట్రోల్ అధికారి మదన్ మోహన్ నిర్వాహం వల్లే తమకు ఈ గతి పట్టిందని, అతడిని తక్షణమే బదిలీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

**జీఎం కార్యాలయం ప్రారంభించకపోవడం వల్లే..**

సత్తుపల్లి-కిష్టారం మధ్యలో నిర్మించిన సింగరేణి జీఎం కార్యాలయాన్ని ప్రారంభించకపోవడం వల్లే ఇలా జరుగుతున్నదని, వెంటనే ఆ కార్యాలయాన్ని ప్రారంభించాలని లారీ యజమానులు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన అధికారులు రెండు నెలల్లో ప్రణాళిక సిద్ధం చేసి స్థానిక లారీలకు లోడింగ్ వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో యజమానులు ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేశారు. లారీ యజమానుల సంఘం కార్యదర్శి కొండపల్లి రమేశ్‌రెడ్డి, సభ్యులు మౌళాలి, సూరిబాబు పాల్గొన్నారు.

## 'జేఈఈ అడ్వాన్స్‌డ్' ఫలితాల్లో..

# ప్రైవేట్ కళాశాలల సత్తా

### అత్యుత్తమ ర్యాంకులతో మెరిసిన ఖమ్మం విద్యార్థులు

ఖమ్మం అర్బన్, జూన్ 2: జాయింట్ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్-2025 పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. వీటిల్లో ఖమ్మం నగరంలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు.

### 'న్యూవిజన్' ప్రభంజనం..



న్యూవిజన్ విద్యార్థులతో యాజమాన్య బాధ్యులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మం న్యూవిజన్ జూనియర్ కళాశాల మరోసారి ప్రభంజనం సృష్టించినట్లు ఆ కళాశాల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. ఓపెన్ కేటగిరీలో పేరాల ప్రణవ్-497వ ర్యాంకును సాధించినట్లు చెప్పారు. వివిధ కేటగిరీల్లో అజ్మీరా రోషిక్ మణిదీప్-5, పీయుష్‌వర్ధన్ రాథోడ్-102, యశ్వంత్-394, కార్తీక్‌సాయి-537, సాయికృష్ణ-556, షణ్ముఖ్-562వ ర్యాంకులు సాధించినట్లు వివరించారు. తమ కళాశాల విద్యార్థులు 2వేలలోపు 50 ర్యాంకులు కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ సీహెచ్ గోపీచంద్, అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ కార్తీక్, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

### 'హార్వెస్ట్'కు జాతీయస్థాయి ర్యాంకులు..



హార్వెస్ట్ విద్యార్థులతో యాజమాన్య బాధ్యులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మం హార్వెస్ట్ విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ తెలిపారు. సాయిచరణ్-83వ ర్యాంకు, సంజయ్-207, నాగ యశ్వంత్-393, సిద్ధార్థ్ -395, శ్రీనివాస్ గౌతమ్‌రెడ్డి-686, చరణ్‌గోపాల్-1,092వ ర్యాంకులతో మెరినట్లు చెప్పారు. తమ కళాశాల నుంచి అత్యధిక మంది ర్యాంకులు సాధించారన్నారు. క్రమశిక్షణాయుత ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణతోనే ఇలాంటి ఉత్తమ ఫలితాలు సాధ్యమైనట్లు చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రామసహాయం పార్వతిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

### 'శ్రీచైతన్య' అగ్రగామి..



శ్రీచైతన్య విద్యార్థులతో యాజమాన్య బాధ్యులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు అగ్రగామిగా నిలిచినట్లు ఆ కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య తెలిపారు. జశ్వంత్‌రామ్-9, ఎస్‌వీ వీరబ్రహ్మం-92, బీ లింగేశ్-144, వీ కుషాల్-165, విక్టోరియా-199, జయంత్-221, అను-258, జ్ఞానతిక్ లక్కీ-270, అంకిత-272వ ర్యాంకులు సాధించినట్లు వివరించారు. తమ విద్యార్థులు 100లోపు 3 ర్యాంకులు, 2 వేల లోపు 65, 5 వేల లోపు 111 ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ సాయిగీతిక, డీజీఎం చేతన్‌మాథుర్, డీన్ వర్మ, కృష్ణ, ఏజీఎంలు చిట్టూరి బ్రహ్మం, ప్రకాశ్, గోపాలకృష్ణ, ప్రిన్సిపాళ్లు అభినందించారు.

### 'రెజొనెన్స్' ఆధిక్యం..



రెజొనెన్స్ విద్యార్థులతో యాజమాన్య బాధ్యులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మం రెజొనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చి ఆధిక్యాన్ని చాటారని ఆ కళాశాల డైరెక్టర్లు రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. స్నేహమృధుల-89, రాకేశ్-230, అభినాయక్-342, మదన్-371, సురేశ్-557, హర్షవర్ధన్-906, శ్యామ్-1,860వ ర్యాంకులతో రాణించినట్లు వివరించారు. తమ కళాశాలకు చెందిన అత్యధిక మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ఇంటర్‌తోపాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు సత్తా చాటుతున్నారన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సతీశ్, భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

### 'కృష్ణవేణి' విజయకేతనం..

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మం కృష్ణవేణి కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని ఆ కళాశాల అధినేత యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. జెస్వాత్-402, మణిచంద్రసాయి-418, భానుప్రసాద్-598, బన్నీ-732, సంహిత-765, రాజేశ్వరి-798వ ర్యాంకులు సాధించినట్లు వివరించారు. 2వేల లోపు 30 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించి ప్రతిభ చాటినట్లు చెప్పారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, డీన్ వంశీకృష్ణ, ఏవో నిరంజన్ అభినందించారు.



కృష్ణవేణి విద్యార్థులతో యాజమాన్య బాధ్యులు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## డల్లాస్‌లో కేటీఆర్‌తో తాతా మధు



డల్లాస్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేటీఆర్‌తో కలిసి పాల్గొన్న తాతా మధు

ఖమ్మం, జూలై 2: అమెరికాలోని డల్లాస్‌లో సోమవారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు పాల్గొన్నారు.

## ఆర్థిక భారాన్ని మోస్తూ..
## ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నాం

ఖమ్మం/ రఘునాథపాలెం, జూన్ 2: ఆర్థిక భారాన్ని మోస్తూ ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం జరిగిన ఖమ్మం నియోజకవర్గస్థాయి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం రైతులకు నాణ్యత గల విత్తనాలను పంపిణీ చేశారు. మెప్మా కింద 178 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.10 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందించారు. తొలుత సాంస్కృతిక సారథి కళాకారులు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పాటలు పాడారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

తిరుమలాయపాలెం, జూన్ 2: వందశాతం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరూ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రఘునాథపాలెం, గోల్‌తండా, దమ్మాయిగూడెం, గోపాలపురంలో బీటీ రోడ్లు, కొక్కిరేణిలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో మాట్లాడారు. మొదట విడతగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, మొదటి విడత ఇళ్లు పూర్తిఅయ్యేలోపు రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, అర్హులందరికి రేషన్ కార్డులు మంజూరీ చేస్తామని హామీ ఇచ్చారు.

## 'వేడుక'లో కళ్లు తిరిగి పడిపోయిన కానిస్టేబుల్

మామిళ్లగూడెం, జూన్ 2: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకుంది. వేడుకల్లో భాగంగా ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎండ తీవ్రత ఎక్కవ ఉండడంతో ముఖ్య అతిథి ప్రసంగం కొనసాగుతున్న సమయంలో నిలబడి ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ ఎస్‌కే హుస్సేన్ పాషా ఒక్కసారిగా కళ్లు తిరి గి కిందపడిపోయాడు. గమనించిన తోటి పోలీసులు.. వెంటనే ఆ కానిస్టేబుల్‌ను పక్కకు తీసుకొచ్చి 108లో ఎక్కించారు. అక్కడ విధి నిర్వహణలో ఉన్న పోలీస్ హెడ్ క్వార్టర్స్ వైద్యుడు డాక్టర్ వేణుగోపాల్ వెంటనే అదే అంబులెన్స్‌లో కానిస్టేబుల్‌కు వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు.

## నీటి సంపులో పడి చిన్నారి మృతి

రఘునాథపాలెం, జూన్ 2: ఇంట్లో ఉన్న నీటి సంపులో పడి చిన్నారి మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని రేగులచలక గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ ఉస్మాన్ షరీఫ్ కథనం ప్రకారం.. రేగులచలక గ్రామానికి చెందిన సత్తి నరేశ్, వినోదకుమారి దంపతుల కుమార్తె సత్తి శ్రీరాజీవి (5) సోమవారం ఉదయం తమ ఇంటి ప్రాంగణంలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ నీటి సంపులో పడిపోయింది. ఎవరూ గమనించక పోవడంతో శవమై తేలింది. కుటుంబ సభ్యులు తరువాత గుర్తించి కన్నీరుమున్నీరుగా విలపించారు. చిన్నారి తండ్రి నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.